వర్ష బీభత్సం



ఆమన్‌నగర్-బీలో సహాయ చర్యలు



టోలిచౌకిలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శిథిలావస్థలతో ఉన్న ఇళ్లు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితిలో బిక్కుబిక్కు మంటూ ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు గురువారం సాయంత్రం బస్తీలను సందర్శించారు. మురుగునీటి కాలువలు పొంగి ప్రవహిస్తుండటంతో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. మ్యాన్‌హోల్స్ నుంచి వరద నీరు మురుగు కాలువల్లోకి చేరే విధంగా బల్దియా సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



యునానీ ఆస్పత్రి గర్భిణుల వార్డులోకి చేరిన వర్షపు నీరు



యాకుత్‌పురాలో పర్యటించిన ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ



జలమయమైన నదీమ్‌కాలనీ రోడ్డు



బస్తీలోని పేదలను అప్రమత్తం చేస్తున్న సీఐ సైదబాబు



గోషామహల్ జిన్సీ చౌరాహిలో కూలిన పాత ఇంటి గోడ



గొడుగులను ఏర్పాటు చేసుకొని కొనసాగిస్తున్న చిరు వ్యాపారాలు

క్లుప్తంగా...

సమాజ సేవకే 'అవోపా' అంకితం



కందికొండ శ్రీనివాస్

అబిడ్స్: సమాజ సేవకే అవోపా (ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) అంకితమవుతుందని ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కందికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా తమ అవోపా సంస్థ ఆధ్వర్యంలో తరచూ వివిధ తరహాల సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈనెల 23న నాగోల్ శుభం కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి ఆర్యవైశ్య వధువరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. అన్ని జిల్లాలో ఆర్యవైశ్య వధువరులకు వివాహాలు చేసుకునేందుకు ఈ పరిచయ వేదిక ఒక శుభ వివాహ వేదిక అవుతుందని కందికొండ శ్రీనివాస్ అన్నారు. ఆన్‌లైన్ ద్వారా http://telanganaavopa.org ఈ వెబ్‌సైట్‌లో వధువరులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సన్మానం



చాంద్రాయణగుట్ట: బోనాల పండగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో పోలీసుల కృషి ఎనలేనిదని డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణానాయక్ అన్నారు. బోనాలు ప్రశాంతంగా ముగిసినందుకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్సై నాగరాజును సన్మానించారు. శ్రీను, మహేష్, మురళీ, రాజు, జైపాల్, రవి, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఉద్యోగులు

యాకుత్‌పురా: కంటి సమస్యలతో బాధపడే వారు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ రంగా సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్ రావు సూచించారు. జన హిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పురానీహవేలీలోని సెట్విన్ శిక్షణ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి శిబిరాన్ని ప్రారంభించిన ఆయన పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న ఉద్యోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో క్యాంపు కో ఆర్డినేటర్ పూర్ణచందర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ మహమూనా, డాక్టర్ రమ్య ప్రియా, సెట్విన్ సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి



చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని అన్ని ఆషుర్‌ఖానాలలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించినప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. గతేడాది రూ.5 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినప్పటికీ అప్పటి పనులనే ఇంకా పూర్తి చేయలేదన్నారు. ఈసారి సంతాప దినాలకు ముందుగానే అభివృద్ధి పనులు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇంకా పనులు మొదలు కాలేదని తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



ఆలే జితేంద్రను గృహ నిర్బంధం చేస్తున్న మొఘల్‌పురా పోలీసులు

గౌలిపురా: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సందర్శన కార్యక్రమంలో పాల్గొనకుండా గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్రను గురువారం ఉదయం మొఘల్‌పురా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. జితేంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్ర మంత్రి హోదాలో కిషన్‌రెడ్డి ప్రశ్నిస్తుంటే నిర్దాక్షిణ్యంగా వారిని అడ్డుకొని అరెస్ట్ చేయడం హేయమైన చర్య అన్నారు.

ఛత్రినాకలో..

చాంద్రాయణగుట్ట: బాట సింగారంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని ఛత్రినాక పోలీసులు బీజేపీ నాయకులను గురువారం ముందస్తు అరెస్ట్ చేశారు. బీజేపీ భాగ్యనగర జిల్లా ప్రధాన కార్యదర్శి కొడీ మహేందర్, ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి, కోశాధికారి పొన్న శ్రీనివాసారావు, నాయకుడు సాయికుమార్‌లను ఉదయాన్నే అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వదిలి పెట్టారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నడిరోడ్డుపై అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు.

ముగిసిన బోనాల ఉత్సవాలు



చివరి తొట్టెల తీసుకెళ్తున్న పోతరాజు మోహన్‌రాజు

లంగర్‌హౌస్: మొదటి పూజ తొట్టెల తీసుకెళ్లే పోతరాజు కళా మండలి తరపున చివరి తొట్టెల, చివరి బోనం సమర్పణ ఊరేగింపు వైభవంగా జరిగాయి. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి చివరి బోనం, చివరి తొట్టెల, ఒడి బియ్యాన్ని లంగర్‌హౌస్ నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పోతరాజు కళా మండలి వ్యవస్థాపకుడు, పోతరాజుల గురువు లంగర్‌హౌస్‌కు చెందిన దివంగత కారుకొండ సత్యనారాయణ సమక్షంలో అమ్మవారికి మొదటి తొట్టెల ఊరేగింపు జరిగేది. ఆయన తరువాత అతని కుమారుడు మోహన్‌రాజు ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం చివరి పూజ పురస్కరించుకొని లంగర్‌హౌస్‌లోని కాళిదాస్ పుర నల్లపోచమ్మ ఆలయం నుండి చివరి తొట్టెల, ఒడిబియ్యం, చివరి బోనాన్ని గోల్కొండకు ఊరేగింపుగా డప్పువాయిద్యాలు, డీజే, యువకులు, ఆడపడుచుల నృత్యాలతో వైభవంగా తీసుకెళ్లి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సంఘ సేవకులు రాజు వస్తాద్ నృత్యాలు చేస్తూ వానలో యువకులను ఉత్తేజపరిచారు. ఈ పూజల్లో ఎస్. స్వామి, వరదరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న బి.సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోటలో జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల 9వ పూజోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. వర్షాలను సైతం లెక్క చేయకుండా భక్తులు బోనాల చివరి పూజకు భారీగా తరలివచ్చారు. కోట అధికారులు వర్షాలను దృష్టిలో ఉంచుకోని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నగీనాబాగ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి పాత నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. వర్షంలో సైతం తడుస్తూ మహిళలు తలపై బోనంతో కోటపై కొలువుదీరిన అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవారి వృత్తి పని సంఘం ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బి.సాయిబాబాచారి సంఘం సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గౌలిపురా: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి విద్యార్థులు, యువకులు నడుం బిగించాలని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గురువారం గౌలిపురాలోని జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్‌లో జాతీయ ప్లాస్టిక్ ఫ్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి ప్రచారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం తెలంగాణ గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది సుమారు 400 కోట్ల ప్లాస్టిక్ కవర్లను వినియోగించడంతో నగరంలో పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుందన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. పాతబస్తీలో ప్లాస్టిక్ పట్ల అవగాహన శిబిరాలతో ఇక్కడి ప్రజలు, విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ అధ్యక్షతన ఉపన్యాసం చేస్తూ 30 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై ర్యాలీలు, సెమినార్ల ద్వారా అవగాహన శిబిరాలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సు ఇంటర్వ్యూలో గందరగోళం

నాంపల్లి: నిలోఫర్ ఆస్పత్రిలో కాంట్రాక్టు విధానంలో స్టాఫ్ నర్సు పోస్టు భర్తీ కోసం చేసిన ప్రకటనకు విశేషమైన స్పందన లభించింది. ఒక పోస్టు కోసం సుమారు 500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులను అదుపు చేయడానికి పోలీసుల సహాయం తీసుకున్నారు. అధికారులు చేసిన తప్పిదాలతో వర్షంలో తడుస్తూ, అనేక వ్యయప్రయాలకోర్చి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చామని ఆశావహులు ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికల్లో ఇచ్చిన ప్రకటనలో స్పష్టత లేకపోవడంతోనే తాము ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందని నిట్టూర్చారు. అందరూ అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి, నిలోఫర్ వైద్యాధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పత్రికా ప్రకటనలో పొరపాటు జరిగిందని స్వయంగా నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి వివరించినా ఆందోళనను విరమించలేదు. స్థానిక నాంపల్లి పోలీసులు జోక్యం చేసుకుని అభ్యర్థులకు సర్దిచెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇంటర్వ్యూకు హాజరైన వారందరూ వారివారి అర్హతా సర్టిఫికెట్లను నిలోఫర్ వైద్యాధికారులకు అందజేసి అక్కడి నుంచి వెళ్లారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

అబిడ్స్: తమ ఇంటిపై ముక్కుమ్మడిగా దాడిచేసినవారి పట్ల పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నగర బీజేపీ మాజీ కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న మంగళ్‌హాట్ ఇంద్రానగర్‌లో ఫ్లెక్సీ విషయంపై చెలరేగిన ఘర్షణలో తమ కుటుంబసభ్యులపై దాడి జరిపి ఇంట్లోని వస్తువులను, కారుతో సహా రెండు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన మంగళ్‌హాట్ కార్పొరేటర్, ఆమె అనుచరులు నిర్భయంగా బయట తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమపై దాడిచేసిన వారిపట్ల కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తమ కుటుంబ సభ్యులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించి తమకు న్యాయం చేయాలని బాలకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్, డీసీపీలను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని ఆయన అన్నారు.

గురుకుల పీఈటీలను తక్షణమే భర్తీ చేయాలి

గన్‌ఫౌండ్రీ: గురుకుల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ నిరుద్యోగ పీఈటీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. 2017 టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ గురువారం నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో 616 పీఈటీ పోస్టుల భర్తీ కోసం 2017లో నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష నిర్వహించారని గుర్తుచేశారు. కాగా అందులో 1200 మంది అభ్యర్థులు ఎంపిక చేసి సర్టిఫికెట్ పరిశీలన కోసం పిలిచారని, వివిధ కారణాలతో ఎంపిక నిలిచిపోయిందన్నారు. గురుకుల పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 6 సంవత్సరాలుగా తాము ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నామని తమకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు గాంధీభవన్ నుంచి ఒక్కసారిగా ముట్టడికి రావడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులకు, అభ్యర్థులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగి పరిస్థితి ఉద్రికత్తంగా మారడంతో అభ్యర్థులను అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

బార్‌లో గొడవ.. ఐదుగురి అరెస్ట్

విజయనగర్‌కాలనీ: సిగరెట్ తీసుకురమ్మని చెప్పినందుకు గొడవ జరిగి పరస్పరం దాడులు చేసుకొనగా ఐదుగురిని అరెస్ట్ చేసిన ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సవారి నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17న గుడిమల్కాపూర్‌లోని కనకదుర్గా బార్ అండ్ రెస్టారెంట్‌కు అదే ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు మద్యం తాగేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ పనిచేసే ఓ వ్యక్తిని సిగరెట్ తీసుకురమ్మని చెప్పగా అతడు వినిపించుకోలేదు. మందుబాబులు, బార్ యజమానికి మధ్య మాటామాటా పెరిగి ఇరువర్గాలు దాడి చేసుకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గుడిమల్కాపూర్‌కు చెందిన పవన్‌కుమార్(24), నరేందర్‌సింగ్ (43), సాయికుమార్(30), రాజు యాదవ్ (40), ఎల్‌బీనగర్‌కు చెందిన వెంకట్ యాదవ్ (37)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు

డబీర్‌పురా: అనుమానాస్పదంగా కత్తితో సంచరిస్తున్న ఓ వ్యక్తికి గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు 10 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధి సీకేఎస్ టెంపుల్ సమీపంలోని దుల్హాఖాన్ మసీదు వద్ద ఈనెల 19న తెల్లవారుజామున 2 గంటల సమయంలో షేక్ ఫహద్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద కత్తి లభించింది. పోలీసులు షేక్ ఫహద్‌పై ఈ-పెట్టీ కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు షేక్ ఫహద్‌ను గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు షేక్ ఫహద్‌కు 10 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మహిళ వేధింపుల కేసులో..

ఓ మహిళను వాట్సాప్‌లో వేధింపులకు గురి చేస్తున్న కేసులో ఓ వ్యక్తికి గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధి ప్రాంతానికి చెందిన రేఖాబాయిని స్థానికంగా ఉండే సారా శ్రీకాంత్ కొన్ని రోజులుగా వాట్సాప్‌లో నాతో స్నేహం చేయాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీనిపై రేఖాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు సారా శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి అతనిపై ఈ-పెట్టీ కేసు నమోదు చేశారు. అనంతరం సారా శ్రీకాంత్‌ను గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు శ్రీకాంత్‌కు 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మొహర్రం సంతాప దినాలు ప్రారంభం



డబీర్‌పురా: డబీర్‌పురా బీబీకా అలావాలో మొహర్రం సంతాప దినాలు ప్రారంభమయ్యాయి. బీబీకా అలావాలో ఏర్పాటు చేసిన ఆలంలను దర్శించుకోవడానికి స్థానిక ప్రాంతాలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీబీకా అలావా పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పూలు, దట్టీలు, ఇతర సామాగ్రినికి విక్రయించేందుకు దుకాణాలు వెలిశాయి.

'సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం'



అబిడ్స్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదింపుతామని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్, కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్ పేర్కొన్నారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని అక్రమంగా పోలీసులు అరెస్టు చేశారని నిజాం కాలేజి ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు, కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గోపాల్‌జీ, పాండుయాదవ్, సురేఖ ఓంప్రకాష్‌లు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ తడాఖ చూపిస్తామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

గౌలిపురా: ఎల్ఎంఎం ప్రొడక్షన్స్ బ్యానర్‌లో వస్తున్న శ్రీ కాల భైరవ బ్రహ్మ కవచం వీడియో సాంగ్ పోస్టర్‌ను బీజేపీ ఎలక్షన్ కమిటీ అధ్యక్షుడు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిర్రర్ డైరెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ.. బ్రహ్మదేవున్ని కాల భైరవుని స్తుతిస్తూ పలికిన కవచం నేను ఈ స్లోకం బ్రహ్మండా పురాణం నుంచి తీసుకొని వీడియో రూపంలో చూపించే ప్రయత్నం చేశానన్నారు. ఈ స్లోకానికి సంగీతం అర్జున్ నల్లగొప్పుల అందించగా.. కెమెరామెన్‌గా అశోక్ రెడ్డి, సింగర్‌గా కొడకండ్ల రామ శరణ శర్మ ప్రోత్సాహం అందించారన్నారు. మిర్రర్ డైరెక్టర్ శ్రీనాథ్, నిర్మాత మాదారం కృష్ణ, కాల భైరవ ఉపాసకులు చంద్ర స్వామి, బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు తుల్లా అమర్ పాల్గొన్నారు.

త్రీడి టెక్నాలజీ ద్వారా బోధనలు ప్రారంభం



ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శశికళారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: ఉస్మానియా వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు నూతన టెక్నాలజీ త్రీడి ద్వారా బోధనలను అందిస్తున్నట్లు ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాలలో ట్రిబుల్‌ఐటీ వారి సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన త్రీడి టెక్నాలజీని ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ నారాయణన్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీతో వైద్య విద్యార్థులకు బోధనను అందించాలనే ఉద్దేశంతో ఉస్మానియా వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు అనాటమి డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రొఫెసర్ జయంతి శివస్వామి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయ, డాక్టర్ జానకి, ప్రొఫెసర్ సుమలత, పద్మావతి, డాక్టర్ నివేదిత, సంధ్య, డాక్టర్ మారియా, డాక్టర్ పరిమళ, వేణుగోపాల్‌గౌడ్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోల్కొండ అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్‌లోని హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు గోల్కొండలో కొలువుదీరిన బ్రమరాంభిక దేవికి పట్టు చీర, ఒడిబియ్యం సమర్పించారు. ప్రతియేటా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు ముత్యాల దుర్గారాణి అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాతి, పారిజాత, ముత్యాల భాస్కర్, రంగాచారి తదితరులున్నారు.

సృజనోత్సవ్-2023 లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ స్వర మహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లలిత కళల పోటీల సమాహారం సృజనోత్సవ్-2023 లోగోను గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇది చక్కటి వేదిక అన్నారు. సంస్థ అధ్యక్షుడు ఆదిత్య కిరణ్ మాట్లాడుతూ.. ఈ పోటీల్లో పాల్గొనదలిచిన వారు 94404 67585, 95051 23489 లలో సంప్రదించాలని సూచించారు.

మల్టీమీడియాకు ఉజ్వల భవిష్యత్



కార్యక్రమంలో పాల్గొన్న జయేష్ రంజన్

గన్‌ఫౌండ్రీ: మల్టీ మీడియా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుదని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో క్రియేటివ్ మల్టీ మీడియా సంస్థ 25వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో డిజిటల్ మీడియా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగమని తెలిపారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్టునిస్ట్ శ్రీధర్, వైభవ్ స్టూడియోస్ క్రియేటివ్ డైరెక్టర్ వైభవ్ కురేష్, సంస్థ ఎండీ రాజశేఖర్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంసీఎంలో రాయితీపై రెయిన్ కోట్లు



చార్మినార్: మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ యాజమాని మహ్మద్ ఇలియాస్ బుకారీ రాయితీలపై రెయిన్ కోట్లను అందుబాటులో ఉంచారు. సరసమైన ధరలకు జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్ కంపెనీల ఉత్పత్తులతో కూడిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను మదీనా సర్కిల్‌లోని షో రూంలో గురువారం ప్రారంభించారు. ప్రత్యేక ఎగ్జిబిషన్ నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. పాఠశాల విద్యార్థులతో పాటు హాస్టళ్లల్లో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా ఎవరైన అధిక మొత్తంలో ఖరీదు చేసి ఇవ్వడానికి ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు నో లాస్.. నో ప్రాఫిట్ కింద పెద్ద ఎత్తున రాయితీ ఇవ్వనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు రెయిన్ కోట్‌తో పాటు తలపై గొడుగులను ధరించే విధంగా ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు.